క్లుప్తంగా

నేడు గడప గడపకు..

ఏర్పేడు: మండలంలోని కందాడు పంచాయతీలోని రాచపాలెం, ఎలకమిట్ట ఎస్టీ కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిర్వహిస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు నగదు సాయం చేస్తున్న ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురానికి చెందిన వెంకటేష్ (31) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా మృతుడి కుటుంబానికి రూ.10వేలను అందజేశారు.

వికలాంగులకు సైకిళ్లు పంపిణీ



వికలాంగులకు సైకిళ్లు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పూడిలో చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మూడు చక్రాల సైకిళ్లను నలుగురికి అందజేశారు. స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ కార్యదర్శి జలగం బాలమురళి సమన్వయంతో వికలాంగులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్ నాయుడు, శేషయ్య, బాలనాయుడు, చెరుకు శ్రీహరి నాయుడు, నరసింహనాయుడు, మాధవ్ నాయుడు పాల్గొన్నారు.

నీటి వృథా అరికట్టరూ!



లీకేజీతో వృథాగా పోతున్న నీరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో పీవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో పైపులైను లీకేజీ మూలాన తాగునీరు వృథాగా అవుతోంది. ఈ మార్గం మీదుగా మున్సిపల్ అధికారులు వెళుతున్నా, పలుమార్లు అధికారులకు సమస్యను తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా పైపులైనుకు మరమ్మతులు చేసి, లీకేజీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

వలంటీరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ బాలాజీనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓసీ(జనరల్)1, బీసీ1, ఎస్సీ1, ఓసీ(మహిళ)1, బీసీ–ఈ 1 పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, 18–25 ఏళ్లలోపు వారు సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 30వ తేదీ వరకు అప్లికేషన్లను పరిశీలిస్తామని, 31న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద జమ్మూ కాశ్మీర్ ఎస్పీ సందీప్ చక్రవర్తి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం జమ్మూకాశ్మీర్ ఎస్పీ సందీప్ చక్రవర్తి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జగనన్న పాలనలో ఆర్థిక భరోసా

- ప్రతి కుటుంబానికీ రూ.4 లక్షల లబ్ధి
- ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి : ఎమ్మెల్యే ఆదిమూలం



నీటి సమస్యపై స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: జగనన్న పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ ఫలాల ద్వారా ప్రతి కుటుంబమూ సుమారు రూ.4 లక్షల వరకు లబ్ధి పొందాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం మండలంలోని మిద్దికండ్రిగ సచివాలయ పరిధిలోని సిద్ధమనాయుడుకండ్రిగ, శ్రీనివాసపురం, బంగారమ్మకండ్రిగ గ్రామాలలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పథకాల రూపేణా పొందిన లబ్ధిని బుక్‌లెట్ల ద్వారా తెలియజేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ఆయా గ్రామాలలో ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధానంగా తాగునీటి వసతి కల్పన, మరుగుదొడ్ల నిర్మాణం, కరెంట్, ఇళ్ల పట్టాలు, ఇంటి నిర్మాణ బిల్లుల చెల్లింపులు..ఇత్యాది సమస్యలను నివేదించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నూతన పింఛన్, ఇళ్లు, కరెంట్ సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు.

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

సిద్ధమనాయుడు కండ్రిగలో ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలోసర్పంచ్ రాజేష్, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఎంపీపీ మునిలక్ష్మి, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, నాయకులునందకుమార్, లాల్‌బాబు యాదవ్, వెంకటరత్నం, ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న ,మోహన్ నాయుడు, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ధనుంజయరెడ్డి, పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్, తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ లక్ష్మీపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందజేసి దీవిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పశు వైద్య శిబిరానికి స్పందన



దొడ్లమిట్టలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరం

రేణిగుంట: పశువులకు సంక్రమించే వ్యాధులపై పాడి రైతులు సరైన అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సునీత అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్టలో గురువారం తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం పశువైద్య శిబిరం నిర్వహించింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ ఈశ్వరమ్మ ప్రారంభించారు. శిబిరంలో 30 పశువులకు గర్భకోశ పరీక్షలు, 40 పశువులకు సాధారణ పరీక్షలు, 150 పశువులకు డీటికింగ్ మందుల పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులతో పశువులు బాధపడుతుంటే సమీపంలోని పశు వైద్యశాలకు తీసుకెళ్లి సరైన వైద్యం చేయించాలని కోరారు. ఇంటాస్ కంపెనీ సాయంతో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి పశువైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు వరప్రసాద్‌రెడ్డి, నవీన్, రంగమ్మ, అనూష, కళాశాల ప్రొఫెసర్లు రాజేష్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన శ్రీసిటీ అధికారులు

- పారిశ్రామిక వృద్ధిపై నివేదన



గవర్నర్‌కు మేడ్ ఎట్ శ్రీసిటీ ఉత్పత్తుల జ్ఞాపికను అందజేస్తున్న శ్రీసిటీ అధికారులు

వరదయ్యపాళెం: శ్రీసిటీకి చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల బృందం, ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామ్ నేతృత్వంలో గురువారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను రాజ్‌భవన్‌లో కలిశారు. శ్రీసిటీ వేగవంతమైన పారిశ్రామిక వృద్ధి గురించి వివరించడంతో పాటు మేడ్ ఎట్ శ్రీసిటీ ఉత్పత్తుల జ్ఞాపికను ఆయనకు బహూకరించారు. శ్రీసిటీని సందర్శించి, ఇక్కడ పురోగతిని వీక్షించవలసిందిగా కోరుతూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టరు రవీంద్రసన్నారెడ్డి తరపున ఆహ్వాన పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు.

24న సత్యవేడులో మెగా జాబ్‌మేళా

నారాయణవనం: ఈ నెల 24న మంగళవారం సత్యవేడులో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మమత కోరారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచనల మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో సీడాప్, డీఆర్‌డీఏ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను సత్యవేడు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలలో 825 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉన్నామని, ఈ దిశగా సంఘమిత్రలు, వెలుగు సీసీల ద్వారా మండలంలో నిరుద్యోగ యువతను గుర్తించి జాబ్‌మేళాకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వల్లంటీర్ల ప్రజలకు, వైఎస్సార్‌సీపీ పార్టీకి వారధిగా ఉంటూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పల్లమాల గ్రామ సచివాలయంలో సర్పంచ్ రమణమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కీలక భూమిక పోషించి, పార్టీకి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు నిరంజన్‌రెడ్డి, ధనలక్ష్మి, యాకోబు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



పార్లపల్లెలో జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా డ్వామా, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ కోరారు. గురువారం ఆయన మండలంలోని పార్లపల్లె లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పక్కా గృహాల నిర్మాణంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని, అలాగే గ్రామాల్లో ఇళ్ల వద్ద వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 341 ఇళ్లు బేస్‌మట్టం స్థాయికి చేరుకున్నాయని, నిర్మాణాలను బట్టి లబ్ధిదారులకు బిల్లులను, సిమెంట్‌ను చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఉపాధి హామీ ఏపీఓ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ముత్యాలమ్మ గుడివీధిలోని చక్రేశ్వరస్వామి, పానగల్‌లోని చల్లేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి పనులను పాలకమండలి చైర్మన్ గురువారం పరిశీలించారు. చక్రేశ్వరస్వామి ఆలయాభివృద్ధి పనులకు రూ.14లక్షలు, చల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధి రూ.18లక్షలు వ్యయం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అభివృద్ధి పనులను మహాశివరాత్రి లోపు పూర్తి చేయాలని ఆలయ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, పాలకమండలి సభ్యుడు సాధన మున్నా రాయల్, అధికారులు శోభారాణి, సూర్యప్రకాష్, నాయకులు సెన్నీరు కుప్పం శేఖర్, మొగరాల గణేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టులకు గాయాలు

ఏర్పేడు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే యత్నంలో ప్రమాదానికి గురై మోటార్ సైక్లిస్టులు గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం..తిరుపతికి చెందిన సురేష్(34), మోహన్(32) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా మేర్లపాక వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పడ్డారు. ఈ ప్రమాదంలో సురేష్, మోహన్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఊరందూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాళహస్తి రూరల్: త్వరలో జరగనున్న చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలో ఊరందూరు, జింగిలిపాలెం, గుంటకిందపల్లి, నారాయణపురం, పెంకులపాడు, మద్దిలేడు, చల్లపాలెం, రాచగున్నేరి తదితర గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను కలసి తమ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునిరాజ, రామచంద్రయ్య, హరి, గోపిగౌడ్, మురగయ్య, వెంకటేష్, చందు, రాఘవరెడ్డి, రంగయ్య, చెంచయ్యయాదవ్, గురవయ్యయాదవ్, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారిణి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి భారతి కోరారు. గురువారం ఆమె మండలంలోని పుత్తేరి, పీవీకండ్రిగ, ఆలత్తూరు గ్రామాల్లోని పొలాల వద్దకు వెళ్లి ఈ–క్రాప్ నమోదు చేసి రైతులతో మాట్లాడారు. ఈ–క్రాప్ నమోదు వలన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధర్‌పై పంటల కొనుగోలు చేయడం వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు. పీఎం కిసాన్, ఈకేవైసీ, ఆర్బీకేల ద్వారా సరఫరా అవుతున్న ఎరువుల గురించి చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'నీటి నిల్వలు లేకుండా చూడాలి'

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రౌతు సూరమాలలోని అక్సోర ఫ్యాక్టరీలో పారిశుద్ధ్యం ఎలా ఉందో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, ఆరోగ్య సహాయకులు రమేష్ బాబు గురువారం పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, గుంతలు పూడ్చి చదును చేయాలని సూచించారు. కార్మికులు ఉండే గదుల వద్ద అపరిశుభ్రత లేకుండా చూడాలని, కర్మాగారం వెలుపల ప్రహరీ వెంబడి కూడా నీరు నిలబడే పరిస్థితులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



వేలూరు అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీడీ

పిచ్చాటూరు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా–శిశు సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వేలూరు, కుప్పంకండ్రిగ, కీళపూడి, కీళపూడి దళితవాడ, పిచ్చాటూరు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు సంఖ్యను, హాజరు పట్టీతో పోల్చి చూశారు. పౌష్టికాహారం సక్రమంగా ఇస్తున్నారా, లేదా? అని చిన్నారులను, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

వేమన పద్యాలు సన్మార్గానికి దిక్సూచి



రేణిగుంట: మాట్లాడుతున్న సాహితీ స్రవంతి కన్వీనర్ వెంకటరమణ



నాగలాపురం మండలం ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూల్లో..



వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న యువశ్రీ మురళి

రేణిగుంట: వేమన పద్యాలు సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి ఓ దిక్సూచి అని సాహితీ స్రవంతి కన్వీనర్ వెంకటరమణ అన్నారు. వేమన జయంతి పురస్కరించుకుని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, తారకరామానగర్ జెడ్పీ హైస్కూల్‌లో సదస్సు నిర్వహించారు. మనుషుల మధ్య విద్వేషాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో సఖ్యతను పెంచే వేమన పద్యాలు ఎంతో అవసరమని, మూఢ నమ్మకాల్లో నుంచి ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నా వేమన పద్యాలు అనుసరణీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, ఉమామహేశ్వరి, రమాదేవి, శ్రీదేవి, ప్రసాద్, శ్రీరాములు, కుప్పయ్య పాల్గొన్నారు.

వేమన పద్యాలతో చైతన్యం

పిచ్చాటూరు: వేమన పద్యాలు సమాజ చైతన్యానికి దోహద పడుతాయని నాగలాపురం మండలం ఎస్ ఎస్ పురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఉదయచంద్రిక అన్నారు. గురువారం యోగి వేమన జయంతి పురస్కరించుకుని 50 వేమన పద్యాలను విద్యార్థులతో పఠనం చేయించి ఘన నివాళి అర్పించారు. అనంతరం వేమన వేషధారణలో విద్యార్థిని కూర్చోబెట్టి వేమన పద్యాల బుల్‌లెట్ ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ, వేమన పద్యాలను చదివితే ధారణ, జ్ఞాపక శక్తి పెరుగుతాయన్నారు. అనంతరం తెలుగు సాహితీ సంస్కృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు తులసీనాథం నాయుడు వితరణ చేసిన 150 నీతి పద్యాల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్లు భూపాల్, కంచి శ్రీదేవి, చంద్రమోహన్, రంజిత్ కుమార్, వెంకటేశ్వర్లు, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జీవిత తత్వాన్ని బోధించిన ప్రజాకవి వేమన

బుచ్చినాయుడుకండ్రిగ: అలతి అలతి పదాలతో అనల్పమైన అక్షరాలు జోడించి జీవిత తత్వాన్ని, జీవిత సత్యాలను, అనుభవాలను కాచి, వడపోసిన తెలుగు మహాకవులలో ప్రజాకవిగా వేమన నిలిచారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి కీర్తించారు. గురువారం ప్రజాకవి వేమన జయంతి పురస్కరించుకుని స్థానిక కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, వేమన శతకంలోని పద్యాలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని, మంచి చెడు, మానవ విలువలు, నీతి నియమాలు వంటివి ఎన్నో కనపడతాయన్నారు. పామరుల వద్దకు తన కవిత్వాన్ని చేర్చిన అసాధారణ కవి వేమనని, తెలుగు భాషకే స్వంతమైన పద్యాలు, తెలుగు జాతికి మణిహారాలుగా నిలిచి, ఊరూరా, వాడ వాడా, పామరుల నోట పలుకుతున్నాయన్నారు, ప్రపంచ కవులలో ఒకరుగా వేమన ప్రాతఃస్మరణీయులని స్మరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయసుధ, వాణి, రామక్క, మాధవీలత, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్, నాదెండ్ల మురళి, సురేష్‌బాబు, మోహన్‌బాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' గ్రామసభలు

నారాయణవనం: మండలంలో కూలీలందరికీ ఉపాధి పనులు పని కల్పించేందుకు శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి, లేబర్ బడ్జెట్‌ను సిద్ధం చేస్తామని ఏపీఓ నాగభూషణమ్మ తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–2024 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు 100 రోజులు పని కల్పించడానికి కావలసిన కొత్త పనులు గ్రామ సభల ద్వారా గుర్తిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సముదాయం, వెంకటకృష్ణపాళ్యం, కీళగరం, వెత్తలతడుకు, శనివారం కసిమ్మిట్ట, భీమునిచెరువు, పాలమంగళం నార్త్, సౌత్, 23న సోమవారం కొండలచెరువు, కల్యాణపురం, తుంబూరు, నైనారు కండ్రిగ, 24న మంగళవారం ఎరికంబట్టు, తిరువట్యం, బ్రాహ్మణతాంగాళ్, బొప్పరాజుపాళ్యం, 25న బుధవారం డీకే పాళ్యం, నారాయణవనం, అరణ్యంకండ్రిగలో లేబర్ బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఉపాధి హామీ సిబ్బందితో పాటు, సమన్వయ శాఖల సిబ్బంది, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు పాల్గొనాలని ఆమె కోరారు.

'ఏకలవ్య' సమస్యలపై నివేదిక ఇవ్వండి



స్కూల్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడులో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య బాలబాలికల గిరిజన మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం పూర్తయినా పలు సమస్యల వలన ప్రారంభానికి నోచుకోకపోవడంపై సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. సమస్యలపై నివేదిక సమర్పించాలని తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావును ఆదేశించారు. గురువారం ఆయన ఏకలవ్య బాలబాలికల గిరిజన మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణాలను పరిశీలించారు. భవనాల నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్న విద్యుత్ కనెక్షన్ లేకపోవడం మూలాన ప్రారంభానికి నోచుకోలేదని ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు ఆర్డీఓకు నివేదించారు. ఇక్కడి సమస్యలపై నివేదిక సమర్పిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఉపాధి పనుల పరిశీలన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తాటిపర్తి పంచాయతీలో ఉపాధి హామీ పనులను గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఆయన మస్టర్‌ను పరిశీలించారు. అలాగే కూలీలు గిట్టుబాటు ధర రూ.257 వచ్చే విధంగా పని చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు ఏవైనా ఉంటే తెలపాలని కూలీలను కోరారు. పొలాలకు మట్టి తోలుకునే సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రేమ్ కుమార్, ఏపీఓ సుజాత, సాంకేతిక సహాయకులు శ్యాం ప్రసాద్, మునిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో 'చాగంటి' ప్రవచనం



చాగంటి కోటేశ్వరరావు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు కార్యక్రమం ఖరారైనట్టు శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. ప్రవచనం విషయమై కాకినాడకు వెళ్లి చాగంటిని అంజూరు సంప్రదించారు. దీనికి ఆయన సుముఖత వ్యక్తం చేయడంతో ముక్కంటి జ్ఞాపిక, శాలువతో సన్మానించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు మహాశివరాత్రి ఉత్సవాలకు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు అంజూరు తెలిపారు. 21న ధూర్జటి ప్రాంగణంలో నిర్వహించే సభాపతి కల్యాణం రోజు చాగంటి ప్రవచనాలు ఉంటాయన్నారు.



మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అక్కుర్తి జెడ్పీ హైస్కూలులో పదవ తరగతి విద్యార్థులకు ఊరందూరు జెడ్పీ హైస్కూలు సోషల్ టీచర్ కూనాటి సురేష్ గురువారం ఉచితంగా సోషల్ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ మాట్లాడుతూ, సురేష్ ఇక్కడి పూర్వ విద్యార్థి అని, అందుకే ప్రతి ఏటా సురేష్ సొంతంగా తయారు చేసిన సోషల్ మెటీరియల్ ఇస్తూంటారని తెలిపారు. వీటిని చదివి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తర్ణత సాధిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చలం, ఈశ్వర్ పాల్గొన్నారు.